



ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

నెల్లూరు : ఎస్ఎఫ్ఐ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులుగా సుకుమార్, పి.సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం వేదాయపాళెంలోని సిపిఎం రూరల్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ రూరల్ 8వ మహాసభ నిర్వహించారు. తొలుత ఎస్ఎఫ్ఐ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో కరెంట్ ఆఫీస్ సెంటర్ నుంచి బాబు జగజ్జీవన్‌రావు విగ్రహం సెంటర్ వరకు విద్యార్థులు భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు అమ్మ ఒడి జెవిడి బకాయిల్ని వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మరియు నెల్లూరు జిల్లాలో గవర్నమెంట్ కళాశాలలో వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా నెల్లూరులో ఉన్న కళాశాలలో అధిక ఫీజులు వసూలు చేయడం దారుణమన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రూరల్ కమిటీ నూతనంగా 15 మందితో ఎన్నుకోవడం జరిగినది. అధ్యక్ష కార్యదర్శులుగా సుకుమార్ పి సంతోష్ కుమార్ సహాయ కార్యదర్శిగా ఉపాధ్యక్షులుగా శివ చక్రి సిసింద్రీ సిద్దు కమిటీ ఎన్నుకోవడం జరిగింది


ఎస్ఎఫ్ఐ రూరల్ కమిటీ

మాఫియా బరితెగింపు..!

ప్రశాంతమైన జిల్లాలో మాఫియా, గుండాలు, రౌడీలు పెత్తనం రోజు రోజుకు పెరిగిపోతుంది. అధికారపార్టీనేతలు ప్రోత్సాహంతోపాటు, నేరుగా నేతల జోక్యం ఉండడంతో అధికారులు, పోలీసుల పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇటీవల కాలంలో మాఫియాతో రాజకీయ దుమారం ఎక్కువైంది. మొన్న గ్రావెల్, ఇసుక, నిన్న తెల్లరాయి మాఫియా, నేడు డ్రగ్స్ ఇలా రాష్ట్రంలోనే సింహపురి పేరు మారు మోగుతోంది. అధికార, ప్రతిపక్షపార్టీల మధ్య విబేధాలు కాకుండా, అధికారపార్టీ నేతల్లోనే మాఫియా గొడవలు ఎక్కువ య్యాయి. వైసిపి అధిష్టానికి ఇది తలనొప్పిగా మారింది.

- మైనింగ్, డ్రగ్స్ హల్‌చల్
- సిలికా, గ్రావెల్, ఇసుకది అదేదారి
- అధికారపార్టీ అక్రమాల దందా


సైదాపురంలో అక్రమంగా తరలించేందుకు నిల్వ ఉంచిన తెల్లరాయి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సింహపురి ఇప్పుడు మాఫియాలకు అడ్డగా మారుతోంది. ఇటీవల కాలంలో అన్ని రంగాల్లో అధికారపార్టీ నేతల అండదండలతో కొందరు వ్యక్తులు రెచ్చిపోతున్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారు. రాజకీయ విబేధాలు సర్వసాధారణమే. మరీ శృతిమించి ఎలాంటి సంబంధం లేని ట్రాన్స్‌జెండర్స్‌ను ఈ వివాదాల్లో లాగుతున్నారు. పోలీసులను చూసి భయపడే గూండాలు, రౌడీలు వీధుల్లోకి వచ్చి పోలీసులకు సవాల్ విసురుతున్నారు. వరుసుగా సాగుతోన్న ఈ వ్యవహారాలు నెల్లూరు జిల్లా ప్రతిష్ట దిగజారుతోంది. ఇటీవల వరకు జిల్లా వ్యాపితంగా గ్రావెల్, ఇసుక, సిలికా దండా సాగింది. కావలి, నెల్లూరు, చిల్లకూరు, కోట, ఉదయగిరి, ఇతర ప్రాంతాల్లో అడ్డూ అదుపు లేకుండా పెద్ద ఎత్తున అక్రమాలు సాగాయి. ఈ దందా వ్యవహారమే కావలిలో ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి, నెల్లూరులో అనిల్‌కు మార్‌యాదవ్, రూప్‌కుమార్‌యాదవ్, ఇతర ప్రాంతాల్లో అధికారపార్టీ నేతల మధ్య పెద్ద గొడవలే జరుగుతున్నాయి. ఈ వ్యవహారం వైసిపి అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. నేతల మధ్య విబేధాలను చక్కబెట్టడానికి ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. ప్రతిపక్ష పార్టీలు అందోళనలు నిర్వహించినా పట్టించుకోకపోవడంతో అధికారపార్టీ నేతల్లోనే విబేధాలు తారా స్థాయికి చేరాయి. సహజ సంపదలు ఎక్కడికక్కడే దోచుకుతింటున్నారు. మైనింగ్, ఇరిగేషన్, ఇతర శాఖ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో కన్నెత్తి చూడడం లేదు. ఎన్నో ఏళ్లుగా గట్టుచప్పుడు కాకుండా సాగుతోన్న సైదాపురం తెల్లరాయి అక్రమ రవాణా విషయంలోనూ అధికారపార్టీ నేతలు వ్యవహారం బయటపడింది. ప్రతిపక్ష టిడిపి నేతలున్నా వైసిపి నేతల ప్రోత్సాహంతోనే సాగింది. వందల కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడ్డారు. ఈ వ్యవహారం వైసిపి జిల్లా నాయకత్వంలోనే విబేధాలకు దారి తీసింది. తిరుపతి, నెల్లూరు జిల్లాల నేతల నువ్వా, నేనా అన్నట్లు తయారైంది. వైసిపి అధిష్టానం జోక్యం చేసుకొని మైనింగ్ వ్యవహారం సర్దుబాటు చేసింది. నేతల మధ్య విబేధాలు మాత్రం తారా స్థాయికి చేరారు. అధికారపార్టీ రాజకీయ చదరంగంలో జిల్లా అధికార యంత్రాంగం మౌనంగా ఉండిపోతుంది. ఏం చేస్తే, ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోననే భయంతో ఏ ఒక్క అధికారి మాఫియా విషయంలో జోక్యం చేసుకోవడం లేదు. దీనిని మరువకముందే జిల్లా వ్యాపితంగా డ్రగ్స్ మాఫియా వ్యవహారం బయటకొచ్చింది. ఎన్నో రోజుల నుంచి జిల్లా వ్యాపితంగా ఇంజినీరింగ్ కాలేజీలను టార్గెట్‌గా చేసుకొని డ్రగ్స్ మాఫియా రెచ్చిపోతోంది. ఫలితంగా డ్రగ్స్ తీసుకున్న యువత రోడ్లమీద పడి దాడులకు దిగుతున్నారు. పోలీసులు చూసీ చూడనట్లు ఉండిపోతున్నారు. ఎవరిపై ఫిర్యాదు చేస్తే ఏం జరుగుతుందోననే భయంతో ఎవరూ ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. ఈ మాఫియాకు అధికారపార్టీ నేతల అండదండలు ఉండడంతో పోలీసులు, ప్రజలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. తాజాగా మాఫియాపై కన్ను పెట్టింది. ఎస్‌పి తిరుమ లేశ్వరెడ్డి ఆదేశాలతో దాడులు నిర్వహించి కొందరిని అరెస్ట్ చేశారు. డ్రగ్స్ అమ్మడం కాదు. ఏకంగా నగరంలో తయారీ చేయడం చూసి ఆశ్చర్య పోయారు. ఈ విషయంలోనూ కొందరు అధికారపార్టీ నేతలున్నారనే విమర్శలు వస్తున్నాయి. నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారాకానాథ్ తనయుడి పాత్ర ఉందంటూ విమర్శలు వచ్చాయి. తమ పిల్లలకు ఎలాంటి సంబందంలేదని కొందరు వ్యక్తులు పనికట్టుకొని తమ కుటుంబంపై ప్రచారం చేస్తున్నారని, స్వపక్ష నేతలపైనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ సంఘటనలతో యువత తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతోందని కుమిలిపోత న్నారు. ప్రశాంతకు నిలయమైన సింహపురిలో ఎటూ చూసిన మాఫియాల మయమైపోతోంది .ఉన్నతాధి. కారులు ప్రత్యేక జోక్యం చేసుకోకపోతే పరిస్థితులు దారుణంగా మారడం తథ్యం.


నెల్లూరు డ్రగ్స్ మాఫీయా వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి


పొదలకూరులో మాఫియా ఘర్షణలు

'సోమిరెడ్డి'పై పోలీసుల తీరు అమానుషం : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు : టిడిపి నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా సత్యాగ్రహ దీక్ష చేస్తుంటే పోలీసులు ఆ దీక్షను భగ్నం చేసేందుకు చేసిన ప్రయత్నం అమానుషమని, అధికార పార్టీకి చెందిన వారు వ్యవహరించిన తీరు అత్యంత హేయమని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పొదలకూరు మండలం తాటిపర్తి , వరదాపురం ప్రాంతంలో సత్యాగ్రహ దీక్ష శిబిరం వద్ద అర్ధరాత్రి సమయంలో తీవ్ర ఉద్రిక్తత నడుమ పోలీసులు నమ్మించి అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ చర్యలను సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్లు ఎంపిక

నెల్లూరు : కేరళలోని ఎన్‌సిసి గ్రూప్ హెడ్‌క్వార్టర్ కొట్టాయం, కులమావులో ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకూ నిర్వహించనున్న ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంప్, ట్రెక్–1శిబిరంలో పాల్గొనేందుకు భక్తవత్సలనగర్ ప్రాంతంలోని కెఎన్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సిసి క్యాండెట్లు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయప్రకాష్ తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడారు.

కూలీలకు సూచనలు

కలువాయి : మండలంలోని వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కలువాయి అటవీలో వేసిన జామాయిల్ చెట్లు కటింగ్‌ను గుంటూరు స్క్వాడ్ డిఎఫ్ఓ మారుతీ ప్రసాద్, స్క్వాడ్ రేంజర్ హరి రాపూరు రేంజర్ రవీంద్ర బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా అడవిలోకి వెళ్లి చెట్లను చూసి అడుగు భాగం వరకు కట్ చేయాలని కూలీ లకు డి ఎఫ్ ఓ సూచించారు. రాపూరు రేంజర్ రవీంద్ర బాబు పలు సూచనలు చేశారు. డి ఎఫ్ఓ వెంట కలువాయి డి ఆర్ ఓ బాలాజీ, సిబ్బంది నాగులు, జనార్దన్,భాగ్యరాజు, రాహుల్ ఉన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు

నెల్లూరు : ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో అష్ఫకుల్లాఖాన్ ,రాంప్రసాద్ బిస్మిల్ 96వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పిం చారు. బాలాజీ నగర్ సెంటర్ లోని టాక్సీ స్టాండ్ ఆవరణంలో ఆవాజ్ ఫౌండర్, ఆవాస్ జిల్లా కమిటీ సభ్యులు అయిన షేక్ రియాజ్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. అష్ఫకుల్లాఖాన్ ,రాంప్రసాద్ సేవలను కొనియాడారు. మైనార్టీలపై కేంద్ర, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలని కోరారు. ఆవాజ్ సాను భూతిపరులు, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ర్యాలీలో నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నెల్లూరు : ప్రభుత్వం మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకపోతే ఈ నెల 26 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియూ) జిల్లా కమిటీ హెచ్చరించింది. మంగళవారం నగర పాలక సంస్థలో పనిచేస్తున్న మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మస్టర్ పాయింట్ల వద్ద ధర్నాలు చేశారు. తొలుత 5,6,7, 8,9 డివిజన్లలో పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ పర్మినెంట్ కోరుతూ కార్మికులు చేస్తున్న పోరాటానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తారని వాగ్దా నం చేశాడన్నారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న పోరాటానికి ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి. సూర్యనారా యణ, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బిపి నరసింహ, ఐద్వానగర కార్యదర్శి కత్తి పద్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.అశోక్,ఆర్ ఎం సునీల్,ఎం శ్రీనివాసులు, భాగ్యమ్మ,కొండమ్మ కామాక్షమ్మ,సలోమి, లోకేష్, జయకుమార్, నాగేశ్వరావు ఉన్నారు.

ఆశా వర్కర్లపై కక్షసాధింపు సరికాదు


డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : ఆశా కార్యకర్తల దీర్ఘ కాలీకమైన, అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14,15 తేదిలల్లో 36 గంటల పాటు మహాధర్నా, వంటావార్పు వంటి కార్యక్రమాలు నిర్వహించారని, ఆ కార్యక్రమాలలో పాల్గొన్న ఆశాలపై ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడటం సరికాదని ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం. పెంచలయ్యను కలిసిన ఆమె మాట్లాడుతూ ఈ ధర్నా లో పాల్గొన్న మహిమలూరు, సంగం, ఇస్కపల్లి, చిత్తలూరు, జొన్నవాడ, బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో ఆశాలుగా పనిచేస్తున్న వారందరికీ ఒక ప్రత్యేకమై ఫార్మెట్‌లో రూపొందించిన దరఖాస్తులు అందజేసి పూర్తి వివరాలు పొందుపరిచి అందజేయాలని కోరడం దారుణమన్నారు. ఈ చర్యలు తక్షణమే నిలిపివేయకపోతే ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు. ఆశా నాయకులు పి.భాగ్యరేఖ, పి.సావిత్రి, టి.అనూరాధ , తదితరులు పాల్గొన్నారు.

'సోమిరెడ్డి' దీక్ష భగ్నం

ప్రజాశక్తి -పొదలకూరు : మండలంలోని వరదాపురం వద్ద రుస్తుం మైనింగ్‌లో అక్రమ తవ్వకాలు చేస్తున్నారంటూ గత మూడు రోజులుగా దీక్ష చేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. దీక్షా శిబిరం నుంచి ఆయనను బలవంతంగా జీపులో ఎక్కించారు. అక్కడ నుంచి ఆయనను తమ ఇంటికి తరలించారు. దీక్షను భగ్నం చేస్తున్న సందర్భంలో దీంతో శిబిరం వద్ద ఉద్రిక్తత నెలకొంది. పొదలకూరు సిఐ రాంబాబు, వెంకటాచలం సిఐ అంకమరావు లు..తమ సిబ్బందితో వచ్చి దీక్షను భగ్నం చేశారు. అడ్డు వచ్చిన పలువురు కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలీసుల చర్యలు నిరసిస్తూ పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు అర్ధరాత్రి ఆందోళనకు చేపట్టారు.

ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : సిఎం వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్సల వ్యయ పరిమితిని రూ.25లక్షలకు పెంచిన నేపథ్యంలో కొత్త ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం కందుకూరు పట్టణం కోటారెడ్డి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద మంగళ వారం కమిషనర్ ఎస్. మనోహర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను ప్రజల కు పంపిణీ చేశారు.

సముద్ర తీరంలో మృతదేహం


ప్రజా శక్తి-గుడ్లూరు : రామాయపట్నం పోర్టు సమీపంలోని సముద్రం ఒడ్డుకి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. సుమారు 45 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి తెల్ల బనీను పైజామా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ మృతదేహాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలో ఆర్యవైశ్యులు, వైసిపి నాయకుడు గుర్రం శింగయ్యకు వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం కందుకూరు పట్టణ వైసిపి కార్యాలయములో ఎంఎల్ఎమానుగుంట మహీధర్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్ఎ మహీధర్ రెడ్డి మాట్లాడుతూ గుర్రం సింగయ్య కుటుంబానికి తమ కుటుంబాని ఆది నుంచి మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. శింగయ్య తండ్రికి తన తండ్రికి మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. అదే సంబంధం నేడు కూడా కొనసాగుతుందన్నారు. శింగయ్య మాట్లాడుతూ తనకి పదవి రావడానికి కారణమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, ఎంఎల్ఎ మహీదర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు మురారి శెట్టి వెంకట సుబ్బారావు, మురారి శెట్టి శ్రీకాంత్ , శ్రీను, కందగడ్ల వెంకటేశ్వర్లు, కోట నరసింహం ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు సబ్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయం కృషి మానసిక వికలాంగుల పాఠశాలలో మానసిక వికలాంగుల మధ్య పుట్టినరోజు వేడుకలను మంగళవారం జరుపుకున్నారు. మానసిక దివ్యాంగులకు తన సొంత నిధులతో నలుగురు వికలాంగులకు వినికిడి యంత్రాలను ,దుప్పట్లను పంపిణీ చేశారు. మానసిక వికలాంగులకు ఆహారం వడ్డించారు. తొలుత పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి పాఠశాల సిబ్బందితో కలిసి సబ్ కలెక్టర్ శోభికకు పుష్పగుచ్ఛం అందజేశారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సాక్షమ్ రాష్ట్ర కార్యదర్శి చన్నా రామాంజనేయులు, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు,గుర్రం మల్లురయ్య,మద్దాలి బాబు,ఏవో,సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలోని 6వ వార్డు కోటకట్ట ప్రాంతానికి చెందిన 10 కుటుంబాల వారు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. పఠాన్ షౌకత్ (హల్లో), పఠాన్ మస్తాన్, పఠాన్ రసూల్, షేక్ ముస్తఫా, షేక్ కరీముల్లా, షేక్ హుస్సేన్ బాషా, షేక్ రియాజ్, షేక్ రసూల్, షేక్ హనీఫ్, ఉమ్మడిశెట్టి రమేష్ కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరారు. పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు అహ్మద్, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, షేక్ ఫిరోజ్, షేక్ మియాజాన్, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సలాం, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పొడపాటి మహేష్ ఉన్నారు.

ప్రీ కిస్మస్ వేడుకల్లో దాడి

సింహపురి యూనివర్సిటీలో ఘటన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో మతోన్మాదులు దాడికి ప్రయత్నించారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ప్రీ క్రిస్మస్ వేడుకలు జరుపుకోడానికి యూనివర్సిటీ అధికారులు అనుమతిచ్చారు. మధ్యాహ్నం 4 గంటలకు వేడుకలు జరుగుతుండగా ఎబివిపి జెండాలు పట్టుకున్న వ్యక్తులు వేడుకల్లో జొరబడి దాడికి ప్రయత్నం చేశారు యూనివర్సిటీలో ఇలాంటి వేడుకలు ఎలా జరుపుతారని, అక్కడ గందరగోళం చేశారు. అక్కడ వస్తువులు పడేశారు. ఇప్పుడు ఇది చేస్తే రేపు సంక్రాంతి, రంజాన్, ఇతర వేడుకలు చేయాలంటూ నినదించారు. విసిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో ఉత్సాహంగా సాగుతోన్న వేడుకల్లో మతోన్మాదులు చొరబడి దాడికి ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా యూనివర్సిటీలో ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా పట్టించుకోకుండా రెచ్చిపోయారు. విద్యార్థులు, సిబ్బంది వేడుకలను రద్దు చేసుకున్నారు.

వ్యవసాయాధికారి పనితీరుపై విమర్శలు

రైతులకు అందుబాటులో ఉండని వైనం

ప్రజాశక్తి - లింగసముద్రం : రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన ఎరువులను, విత్తనాలను సరఫరా చేస్తూ వారికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన మండల వ్యవసాయాధికారి అబ్రహం లింకన్ తీరుపట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై ముమ్మరంగా రైతులు వివిధ పంటలు సాగు చేసుకుంటూ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. వారికి అవసరమైన ఎరువులు ఆర్‌బికె కేంద్రాలలో అందుబాలులో ఉంచడంలో వ్యవసాయాధికారి పూర్తిగా విఫలం చెందారని రైతులు విమర్శిస్తున్నారు. ఎరువులు గురించి అడిగినప్పటికీ పూర్తి స్థాయిలో ఎరువులను తీసుకరాలేదు. ఇటీవల మండలంలో ఓ గ్రామానికి చెందిన రైతు వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతుందని, ఎరువులు కావాలని పలు దఫాలుగా అడిగినప్పటికి ఎలాంటి స్పందన రాకపోవడంతో జగనన్నకి చెబుదాంలో పిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయాధికారి అబ్రహం లింకన్ ఆగమేఘూలుగా పరుగులు తీసి ఫిర్యాదు చేసిన రైతుతో మాట్లాడకుండా ఎలాగైన అతను ఫిర్యాదు వెనక్కి తీసుకొనేలా చేయాలని ఆర్‌బికె సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారు. వ్యవసా యాధి కారి పనితీరు పట్ల ఉన్నతాధికారుల ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎరువులు అర కొరగా ఉండటంతో రైతులు ప్రవేటు దుకాణలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది.

సిబ్బందిపై పనిభారం


వ్యవసాయాధికారిగా తాను చేయాల్సిన పనులను విఎఎలు చేత చేయిస్తూ వారిపైనా పనిభారం మోపుత్నుట్లు విమర్శలు ఉన్నాయి. విఎఎలు తమ పనితో పాటు ఎఒ పనులు కూడా చేయడం వల్ల పనిభారం ఎక్కువగా ఉందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒఒగా తాను చేయాల్సిన పనులు కూడా తమ చేత చేయించడంపై వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఆలోచిస్తున్నారు.

ఎంఎల్ఎ మందలించినా..

పనితీరులో మార్పులు తెచ్చుకొని రైతు సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి మందలించినా ఆయన పనితీరులో మార్పు కనిపించలేదు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా గ్రామల్లో తిరుగుతున్న సమయంలో పలువురు రైతులు రైతు భరోసా నగదు జమ కాలేదని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఎఒ చెప్పిన కారణాలు విని ఎంఎల్ఎ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అయినప్పటికి ఆయన పనితీరులో మార్పులు రాలేదంటున్నారు.

పంట నష్టం అంచనా వేయడంలో విఫలం

మిచౌంగ్ ప్రభావంతో మిర్చి పైరు దెబ్బతిని రైతులు బాగా నష్టపోయారు. పొలాల్లో తిరిగి నష్టపోయిన పంటను పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేయడంలో విఫలం చెందారు. కొన్ని గ్రామల్లో సిబ్బందిని పంపించి చేతులు దులుపుకున్నారు. సబ్సిడీ పనిముట్ల సరఫరాలో అవకతవకలు జరిగినట్లు రైతులు విమర్శిస్తున్నారు. మండల వ్యవసాయాధికారి పనితీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటే రైతు సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు.



ఇద్దరు నేతల పదవులు పదిలం..!

నుడా, ఎపిపిడిసి ఛైర్మన్‌గా మరో రెండేళ్లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి


మెట్టుకూరు చిరంజీవిరెడ్డి


ముక్కాల ద్వారకానాథ్

ఎపిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులను మరి కొద్ది నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా నుంచి ఇద్దరు నేతల పదువుల పదిలమ య్యాయి. నుడా ఛైర్మన్‌గా ముక్కాల ద్వారకానాథ్, ఎపి పోలీసు డెవల ప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మెట్టు కూరు చిరంజీవి రెడ్డి పనిచేస్తున్నారు. వీరిద్దరి పదవి కాలం ముగిసింది. ఈ పదవుల కోసం పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 48 మంది చైర్మన్ల పదవి కాలాన్ని 2024 జులై 27 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇరువురు నేతలు మరికొంతకాలంలో ఈ పదువుల్లో కొనసాగనున్నారు.

తాళాలు పగులగొట్టడం సరికాదు

గుడ్లూరు : మండల కేంద్రమైన గుడ్లూరులో స్థానిక అధికారులు సహకారంతో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నీలాంబరం అంగన్‌వాడీ కేంద్రం తాళం పగులగొట్టించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు పగలగొట్టి తలుపులు తీస్తున్నట్లు సూపర్‌వైజర్ తెలిపారు. గుడ్లూరులో ఎస్సీ కాలనీ తాళాలు పగలగొట్టడానికి యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. చెమిడిది పాడు గ్రామంలోనూ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు.

హామీలను అమలు చేయాలి

ఎనిమిదో రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె


నెల్లూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


ఉలవపాడులో..

ప్రజాశక్తి-నెల్లూరు : ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఎనిమిదో రోజుకు చేరింది. మంగళవారం నగరంలోని మహిళా, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. సిఐటియు నగర కమిటీ నాయకులు జి.నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, కిన్నెర కుమార్,ఐద్వా నగర కార్యదర్శి కే పద్మ , ఎస్ఎఫ్ఐ రూరల్ కమిటీ నాయకులు పాల్గొని అంగన్‌వాడీల నిరవదిక సమ్మెకు సంఫీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు పని ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో గొడ్డు చాకిరి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం అంగన్‌శాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టి సరుకులను దొంగతనంగా సచివాలయాలకు తరలించడం హేయమైన చర్య అన్నారు.

తాళాలు పగలగొట్టారు..

అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాలకు తాళాలు వేసి ధర్నా శిభిరంలో కూర్చొని ఉండగా జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆర్‌డిఒ కార్యాలయం, స్థానిక సచివాలయం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ ఎసిడిపిఒ మొత్త ఆరుగురు ఓ బృందంగా ఏర్పడి నగర, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి తెరిచారు. నారాయణ రెడ్డి పేట పరిధిలో 5, ఆమంచర్ల పంచాయతీ పరిధిలో 10, రామచంద్రాపురం,కామాటి హరిజనవాడ, అల్లీపురం ఎస్ టి సెంటర్, గాంధీ నగర్ సెక్టార్, కొత్త వెల్లంటి ప్రాంతంలో 3, కందమూరు , కాకుపల్లి, సౌత్ మోపూరు, కెఎన్ఆర్ అంగన్ వాడి కేంద్రం, స్నేహనగర్, భక్తవత్సల నగర్, వెంగళరావు నగర్, వేదాయపాళెం సెంటర్, బాలాజీ నగర్, చిల్లకూరు సంఘం తదితర ప్రాంతాల్లో తాళాలు పగులగొట్టి అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచారు. వెంకటేశ్వరపురం, కోటమిట్ట, శివగిరి కాలనీ, ఇరుగాళమ్మ గుడి సెంటర్, మన్సూర్‌నగర్, చమ్మడివారితోట, రావిచెట్టుసెంటర్, 15వ డివిజన్ ప్రాంతాలో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నం చేసి స్థానికులు అడ్డుకోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు.

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో 8వ రోజు అంగన్‌వాడీల సమ్మె జరిగినది. ధర్నా కార్యక్రమానికి కె రాజేశ్వరి అధ్యక్షత వహించారు. కందుకూరు సిఐటియు నాయకులు ఎస్ఎ గౌస్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాలాద్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలపై మొండి వైఖరి విడనాడాలన్నారు. ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. తాళాలు పగలగొడతామని, సచివాలయం ఉద్యోగస్తులు ద్వారా స్కూలు నడుపుతామని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. సిఐటియు ఉలవపాడు బాధ్యులు జివిబి కుమార్, విశ్రాంత వార్డెన్ బి వెంకటేశ్వర్లు, ఎస్ సరస్వతి ,ప్రభావతి ,అనురాధ, రహమతుల్లా పాల్గొన్నారు.

బెదిరింపులు సరికాదు..

కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు, ఉలవపాడు, లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో రెవెన్యూ సిబ్బందిని, సచివాలయ సిబ్బందిని ఉపయోగించి సెంటర్ల తాళాల పగలగొట్టం సరికాదని సిఐటియు విమర్శించింది. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పూనుకోవటం నేరమని, ఈ చర్యలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు జి వెంకటేశ్వర్లు జివిబి కుమార్ ఎస్ఎ గౌస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను బెదిరించడం మానుకుని వారి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు జిల్లా కమిటీ సభ్యులు జీవీబీ కుమార్ ఎస్ఎ గౌస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉలవపాడు : ఉలవపాడు ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీల ఆందోళన 8వ రోజుకు చేరింది. అంగన్‌వాడీ వర్కప్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగుతున్న ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు జి.వి.బి. కుమార్ పాల్గొని మాట్లాడారు. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని చెప్తూ, మరో వైపు బలవంతంగా సెంటర్లకు వెళ్లి తాళాలు పగలగొట్టటం ఏమిటని ప్రశ్నించారు. సమ్మెను విచ్ఛిన్నం చేయటం కోసం ఇలాంటి చీప్ ట్రిక్స్ ప్రదర్శించవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి వారు హెచ్చరిక చేశారు. బలవంతంగా తాళాలు పగలగొట్టించడం సరికాదని ప్రాజెక్టు లీడర్లు సిహెచ్ ఇందిరావతి, వాకా.లత రెడ్డి ఎస్.కె పద్మజ బీ.మార్తమ్మ, ఎస్.కే. అమీరున్నిసా, సిహెచ్ పద్మజ పి .ప్రసన్న,పి.రమణ పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ నాయకులు శివలీల,ప్రవీణ,గీత, తిరుపతమ్మ ,డి. వరలక్ష్మి, కె.శైలజ, పంతగాని.ధనలక్ష్మి కే. శ్రీదేవి,డి.రమాదేవి, రమాదేవి ఉన్నారు.

గుడ్లూరు : తమ న్యాయమైన హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తుందని సిఐటియు మండల కన్వీనర్ జి వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆయన ఇక్కడ మాట్లాడారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు ఉలవపాడు ఐసిడిఎస్ కార్యాలయం దగ్గర ఉండగా స్థానిక సూపర్‌వైజర్ స్థానిక అధికారులను అంగన్వాడీ కేంద్రాల దగ్గరకు తీసుకెళ్లి కేంద్రాలకు వేసినా తాళం బుర్రలు పగల కొట్టించడం సరికాదని జి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.


కందుకూరులో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

- అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టిన అధికారులు, పలుచోట్ల అడ్డగింతలు


అనంతసాగరంలో

ప్రజాశక్తి-అనంతసాగరం : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా అనంతసాగరం ప్రాజెక్టు వద్ద మంగళవారం అంగన్‌వాడీలు వంటావార్పు కార్యక్రమం నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. అంగన్వాడీల సమ్మెకు కౌలు రైతుసంఘం, యుటిఎఫ్, ఆవాజ్ పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, యుటిఎఫ్ మండల కార్యదర్శి వద్దిబోయిన వెంకటేశ్వర్లు రెడ్డి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు పాపిశెట్టి నరసింహులు, వలీ అహ్మద్, సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ బాషా, మర్రిపాడు మండలం సిఐటియు కార్యదర్శి బత్తల రత్తయ్య, మర్రిపాడు మండలం ఆవాజ్ నాయకులు రహమతుల్లా, గౌస్ బాషా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అనంతసాగరం ప్రాజెక్టు నాయకులు సునీత, లక్ష్మీ, సుబ్బమ్మ, వసుంధర, నూర్జహా భాగ్యమ్మ, మర్రిపాడు మండలం ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి, మిడ్ డే మీల్స్ మండల కార్యదర్శి, అనంతసాగరం ప్రాజెక్టులోని వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు యుటిఎఫ్, ఆవాజ్ మద్దతు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలో గత ఎనిమిది రోజుల నుండి అంగన్‌వాడీ టీచర్లు చేస్తున్న న్యాయమైన పోరాటానికి యుటిఎఫ్, ఆవాజ్ కమిటీలు, ప్రజాసంఘాలు మంగళవారం సంఘీభావ మద్దతు తెలియజేశాయి. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్.రషీద్ మాట్లా డుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సచివాలయ సిబ్బంది బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరుస్తున్నారని, మండలంలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొడుతున్నారని, ఇది చట్ట విరుద్ధమని మండిపడ్డారు. తక్షణమే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల న్యాయమైన కోరికలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు రెడ్డి, నరసింహులు, వలీ అహ్మద్, మర్రిపాడు మిడ్డే మీల్స్ నాయకురాలు రాములమ్మ,ఆవాజ్ మర్రిపాడు మండల కార్యదర్శి సయ్యద్ గౌస్‌బాషా, మండల ఉపాధ్యక్షులు సయ్యద్ రహమతుల్లా, మహమ్మద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి రూరల్ : రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె 8వ రోజు మంగళవారం కొనసాగింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పోస్ట్ కార్డు ద్వారా అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్లు తెలుపుకున్నారు. సమ్మెకు మహాజన సోషలిస్ట్ పార్టీ మద్దతు తెలియజేసింది. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య, వ్యకాసం నాయకులు టి.మాల్యాద్రి, సిఐటియు నాయకులు వై.కృష్ణ మోహన్, తుమ్మల వెంకయ్య, నరహరి, బి కృష్ణయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రఘురావమ్మ, సుభాషిణి, కళావతి, వజ్రమ్మ, శాంతి కుమారి, తదితరులు పాల్గొన్నారు.


కావలిలో పోస్ట్‌కార్డులు చూపుతున్న అంగన్‌వాడీలు



ప్రజాశక్తి-ఉదయగిరి : అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తూ బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు నాయకులు కాకు వెంకటయ్య, టిడిపి మండల అధ్యక్షులు బయన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం 8వ రోజు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్ వాడీలు నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల న్యాయమైన కోరికల కోసం చేపడుతున్న సమ్మెకు టిడిపి నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. సిఐటియు నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టే వారిని అరెస్టు చేయాలన్నారు. జరిగే పార్లమెంటు సమావేశంలో అంగన్‌వాడీల సమస్యలు చర్చించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి బిసిసెల్ నాయ కులు మతకాల శ్రీను, మాజీ సర్పంచ్ వెంకట స్వామి, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షు రాలు ప్రమీల, నాయకులు రమాదేవి, విద్యార్థి సంఘ నాయకురాలు కళ్యాణి, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 8వ రోజు మంగళవారం ఇందుకూరుపేటలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందుకూరుపేట లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సిఐటియు అధ్యక్షులు టివివి ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు ఎస్‌కె చాన్‌బాషా, మనోహర్, దయాసాగర్, వెంకయ్య, వెన్ను వేణు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


ఇందుకూరుపేటలో..


వింజమూరులో...


ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : అపరిష్కృతం గా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె రోజు రోజుకు ఆందోళన తీవ్ర రూపం దాలుస్తుంది. ఇప్పటికే ఆర్‌డిఒ కార్యాలయం, కలెక్టరేట్ కార్యాలయాలు ముట్టడించారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చలనం లేకపోవడం శోచనీయమని, అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు పి.రాధమ్మ అన్నారు. మంగళవారం ఆత్మకూరు ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు వంటావార్పు కార్యక్రమం నిర్వహిం చారు. సిఐటియు మండల గౌరవాధ్యక్షులు కొప్పోలు డేవిడ్ రాజు, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు కె.రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మి, విజయమ్మ, మస్తానమ్మ, పద్మావతి, శ్రీదేవి, విజయమ్మ, రూతమ్మ, విజయభారతి, భాగ్యలక్ష్మి, సిపిఎం నాయకులు రమణయ్య, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఖాదర్ బాషా, తదితరులున్నారు.

ప్రజాశక్తి-వింజమూరు : సమ్మెలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వింజ మూరులోని ఐసిడిఎస్ ఆఫీసు ఎదుట వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలియ జేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య మాట్లా డుతూ అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిఐ టియు మండల కార్యదర్శి ఎం.భాస్కర్ రెడ్డి, జి.కామాక్షయ్య, అంగన్‌వాడీ నాయకులు శారద, మమత, శ్రీదేవి, సీతాదేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : గత ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లను కాదని సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిడిపిఒలు సెంటర్ తాళాలు పగలగొట్టడం అన్యాయమని వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి, జలదంకి మండల కార్యదర్శి ఎం.ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం జలదంకిలోని సురే చెంచురెడ్డి భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర మంత్రి బొత్స సత్య నారాయణ తాము తాళాలు పగులగొట్టమని చెప్పలేదని చెప్పి, స్థానిక అధికారులతో ఈ దారుణం చేయించడం ఎంతవరకు సమంజసం మని వారు ప్రశ్నించినారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జి.యానాదయ్య పాల్గొన్నారు.


జలదంకిలో మాట్లాడుతున్న తాళ్లూరు మాల్యాద్రి

తాళాలు పగులగొట్టడాన్ని అడ్డుకున్న నాయకులు


అధికారులను అడ్డుకున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం నిరధిక సమ్మె చేస్తున్న నేపథ్యంలో మంగళవారం నెల్లూరు రూరల్ మండలంలోని పాతవెల్లంటి, కొత్తవెల్లంటి పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టేందుకు ప్రయత్నించిన సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ, విఆర్‌ఒలను సిపిఎం, సిఐటియు నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు నోటీసు ఇచ్చి సమ్మె చేపడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాల తాళాలు పగులగొట్టే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. ఈ విధమైన చర్యలను సిపిఎం, సిఐటియు తరపున తాము ఖండిస్తున్నామన్నారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలు చేయని పక్షంలో అంగన్‌వాడీలు సమ్మె చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీలతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్క రించి వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్ర మంలో సిపిఎం, సిఐటియు నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ యువత పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న నేపథ్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల వెనుకవైపున ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తాళాలు పగులగొట్టేందుకు యత్నించగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య అడ్డుకొని అధికారికంగా ఆధారాలు ఉంటే చూపించాలని అడుగగా వారు వెనుదిరిగి వెళ్లారు. అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె నోటీసు ఇచ్చి నిరసనలు చేస్తున్నారన్నారు. సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చ కుండా ఈ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. మండల వ్యాప్తంగా అధికారులు కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించేందుకు ప్రయత్నించగా పలు ప్రజాసంఘాల నాయకులు ప్రజలు అడ్డుకున్నారు.


ఆత్మకూరులో అడ్డుకుంటున్న ఎస్‌కె సంధాని

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గత ఎనిమిది రోజుల నుండి అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తూ ఉంటే వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి కేంద్రాలను సచివాలయ సిబ్బందితో విధులు నిర్వర్తించడం సరైన పద్ధతి కాదని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను విఆర్‌ఒ సచివాలయ సిబ్బంది తాళాలు పగలగొట్టి స్వాధీనం చేసుకుంటున్నారు. అందులో భాగంగా ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సచివాలయ సిబ్బంది తాళాలు పగలకొట్టే క్రమంలో సంధాని అడ్డుకున్నారు.


అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఉదయగిరి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ రెవెన్యూ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేందుకు వెళ్లగా గ్రామస్తులు వారిని అడ్డుకుని, ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని కుర్రపల్లి బీసీకాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రామస్తులు కేంద్ర తాళాలు తీయకుండా ప్రభుత్వ అధికారులను అడ్డుకున్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ హక్కుల సాధనకై గత కొద్దిరోజులుగా ఆందోళన చేస్తూ కేంద్రాలను మూసివేశారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ అధికారులు తాళాలు తీయడం ఏమిటంటే వారిని నిలదీశారు. కాసేపు వారి ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా ఎట్టకేలకు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని అందుకు గ్రామస్తులు సహకరించాలని అధికారులు కోరి తాళాలను తీశారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న రాజారమేష్ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి-ఉదయగిరి : ఓటర్ల నమోదులో నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు తొలగింపులు చేర్పులు మార్పులపై నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను ఆదేశించారు. ఫారం-7పై అభ్యంతరాలు ఉంటే బిఎల్ఒ, విఆర్ఒ, తహశీల్దార్ దృష్టికి తీసుకురావాలని నాయకులకు సూచించారు. ఫారం-7 ఏవైనా అవకతవకలకు పాల్పడితే ఎలక్షన్ కమిషనర్ మార్గదర్శకాలతో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో ఓట్ల నమోదు తొలగింపులు మార్పులు చేర్పులకు అన్ని రాజకీయ పార్టీలు నాయకులు సహకరించి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఇటీవల గండిపాలెం బూత్ నెంబర్ 31, 32 వచ్చిన ఫిర్యాదులపై గ్రామసభ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తున్నామని గ్రామంలో ఓటు పొందే ప్రతిఒక్కరూ స్థానికంగా ఉండి సంబంధిత ధ్రువపత్రాలు బిఎల్ఒలకు సమర్పించి సిబ్బందికి సహకరించి నిర్ధారణ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, ఎలక్షన్ డిటి శ్యామ్, అన్ని రాజకీయ పార్టీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు



ప్రజాశక్తి-కావలి : ఇటీవల విక్రమ సింహపురి యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఆటల పోటీల్లో కావలి శ్రీ సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. ఉమెన్స్ కబడ్డీ విన్నర్స్ గానూ, మెన్స్ కబడ్డీ రన్నర్స్‌గా నిలవడమే కాకుండా వి అర్చన 100 మీటర్ హర్డిల్స్ ఫస్ట్ ప్లేస్ మరియు 200 మీటర్స్ రన్నింగ్ సెకండ్ ప్లేస్, షార్ట్ పుట్ సెకండ్ ప్లేస్ అలాగే కే భూమిక జావెలింగ్‌త్రో థర్డ్ ప్లేస్, కే రాజేష్ హై జంప్ థర్డ్ ప్లేస్ సాధించారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నగళ్ళ శ్రీనివాస కిరణ్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించినందుకు సంతోషంగా ఉందని తెలియజేశారు. ఇంకా మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులను అభినందిస్తూ ఆశీర్వదించారు. కార్యక్రమంలో కొత్తపల్లి గ్లోబల్ స్కూల్ కరెస్పాండెంట్ పి.శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ షేక్.బీబావలి, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ ఎం.సాంబశివయ్య, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యను పరిష్కరిస్తా..


సమస్యను వింటున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం కచ్చేరీమిట్టలోని 1991బి, 1992, 1993 సర్వే నెంబర్లలో నివాసముంటున్న ఇళ్లు, స్థలాలు కలిగిన ప్రజలు తమ చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలని మంగళవారం ఎంఎల్ఎ ప్రతాప్ కుమార్ రెడ్డిని కలిసి తమగోడును వెళ్లబోసుకున్నారు. తాము గత 60సంవత్సరాలుగా కచ్చేరిమిట్టలో నివసిస్తూ, తమ ఇల్లు నివేశ స్థలాలు రిజి స్ట్రేషన్ అయి ఉన్నప్పటికీ, ఇంకా చుక్కల భూమి కింద ఉండటం వల్ల తగిన భద్రత ఆర్థిక ప్రయోజనాలు ఏమీ లేకుండా పోయినవని చెప్పుకున్నారు. ఎంఎల్ఎ వెంటనే స్పందించి, ఇంతకాలం తన దగ్గరికి మీరు ఎందుకు రాలేదని అడిగి వెంటనే, సదరు విషయం గురించి కావలి రెవెన్యూ డివిజనల్ అధికారిని తగిన వివరణ ఫోన్ కాల్ ద్వారా కోరారు. ఈ సర్వే నంబర్లు పొందుపరిచి కలెక్టర్ ఆమోదం కొరకు పంపించామని, కానీ ఇంకా కలెక్టర్ ఆమోదం పొందలేదని తెలిపారు. కార్యక్రమంలో ఇర్మియా ప్రభాకర్, సందేశ్ కుమార్, రత్న ప్రసాద్, రామారావు, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై కార్యాచరణ


మాట్లాడుతున్న పసుపులేటి సుధాకర్

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని పిఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కార్యచరణపై మంగళవారం విస్తృతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని సమస్యలు మండల అభివృద్ధి కార్యాచరణపై చర్చించామని, మండలంలోని 16 పంచాయతీల నుండి గ్రామపెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ పెట్టి నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే ఎన్నో సేవా కార్యక్రమాలు కావలి నియోజకవర్గ ప్రజలకు చేస్తానని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలో ప్రజలు ఆశీర్వదిస్తే కావలి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానన్నారు. కార్యక్రమంలో పిఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు, మాజీ మండల కన్వీనర్ పసుపులేటి వెంకటేశ్వర్లు, పంది పెనుకొండయ్య గౌడ్, రబ్బానీ, వెంకటేశ్వర నాయుడు, మామిడి జగదీష్, శ్రీనివాస్ యాదవ్, వాయిల లక్ష్మయ్య, పసుపులేటి సుబ్బారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం


ఎన్నికైన ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ

ప్రజాశక్తి-కావలి రూరల్ : ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభ స్ఫూర్తితో విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీహర్ష పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ కావలి పట్టణ మహాసభ ఉపాధ్యక్షులు రాకేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. కావలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల లేకపోవడం అత్యంత సిగ్గుచేటని అన్నారు. జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు పూర్తిస్థాయిలో ఎక్కడ మూలిక సదుపాయాలు అందే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ నాయకత్వం ఈ మహాసభ స్ఫూర్తితో అలుపెరుగని పోరాటం చేసి ఈ సమస్యలు పరిష్కరించుకుంటుందని తెలిపారు. అనంతరం కావలి పట్టణ నూతన కమిటీ ఎన్నుకున్నారు. పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శి పి.మవీన్, వై.ఉదయ్, సహాయ కార్యదర్శులుగా, వి.అభి, పి.వర్షిత్, పి.లోకేష్, ఉపాధ్యక్షులుగా వి.రానా, పి.జయంత్‌కుమార్ ఎన్నికయ్యారు. 16 మందితో పట్టణ కమిటీ ఎన్నికైంది.

ఆలయ నిర్మాణానికి రూ.50లక్షలు


ఎంఎల్ఎను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మర్రిపాడు : నియోజకవర్గంలో అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన ఆధ్యాత్మిక చిహ్నమైన శ్రీ కామాక్షి సమేతా సోమేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి తన స్వంత నిధులు రూ.50 లక్షలు అందజేసి ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించారని పలువురు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం బ్రాహ్మణపల్లిలోని తమ నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పలు మండలాల నాయకులు పాల్గొని మాట్లాడుతూ సోమేశ్వరాలయ పునర్నిర్మాణం కోసం పనులు ప్రారంభించేందుకు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి రూ.50లక్షలు అందజేయడం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి దేవాదాయశాఖ ద్వారా రూ.కోటి నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ నిధులతో ఆలయ రాజగోపురం నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డిల ఆశీస్సులతో ఎంఎల్ఎ విక్రమ్ రెడ్డి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు


మర్రిపాడులో..

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అష్ఫాఖుల్లాఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్ 96వ వర్ధంతి సందర్భంగా మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు వారి చిత్రపటాలకు పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ పాల్గొని మాట్లాడుతూ మాతృభూమిని బ్రిటీష్ వారి నుండి విముక్తి చేయాలని పోరాటం కొనసాగించారని తెలిపారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, ఆవాజ్ మండల కార్యదర్శి ఎస్‌డి గౌస్ బాషా, ఉపాధ్యక్షులు ఎస్‌డి రహంతుల్లా, సీనియర్ నాయకులు పఠాన్ రసూల్, సయ్యద్ కాలేషా, మహబూబ్ దాదా, జిలాని, మహమ్మద్ రఫీ, సుభాని, గౌస్‌బాషా, సూర్యనారాయణ, రామయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : బిస్మిల్లా ఖాన్ పండిత్ రాంప్రసాద్ బిస్మిల్ 96వ వర్ధంతిని మండల ఆవాజ్ కమిటీ సభ్యులు నాయబ్ రసూల్ ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఎంపిటిసి కాకు విజయ పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారత జాతీయోద్యమ చరిత్రలోని 'అగ్నియుగం' నాటి విప్లవ పోరాటయోధులు రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌లు మధ్య ఏర్పడిన స్నేహబంధం ఎంతో త్యాగపూరితమైందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు నాయబ్ రసూల్, భాషా, మొహిద్దిన్, చిన్న, ఫరీద్, పెద్ద ఫరీద్, రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య, పందిళ్ల వెంకటేశ్వర్లు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించి బ్రిటీష్ వలస పాలకులపై విప్లవించి అమరులైన యోధులలో ఒకరు అష్ఫాఖుల్లాఖాన్ అని ఆవాజ్ మండల కార్యదర్శి పి.ఎస్దాని అన్నారు. మంగళవారం అష్ఫాఖుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి 96వ వర్ధంతి ఆత్మకూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎసిఎస్ఆర్ కాలనీ కార్యదర్శి, షేక్.నాయబ్, 14వ వార్డు కార్యదర్శి పి.అస్గర్, కమిటీ సభ్యులు చాంద్ బాషా, బాదుల్లా, ఆషీకీన్, సుభాని పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం : అష్ఫాఖుల్లాఖాన్–రాం ప్రసాద్ బిస్మిల్‌ల చరిత్ర యువత తెలుసుకోవాలని మండల కార్యదర్శి షేక్ మునీర్ బాషా అన్నారు. 96వ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మునీర్ బాషా మాట్లాడుతూ ఈ రోజు అమరవీరులు అష్ఫాఖుల్లా ఖాన్ – పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్ లను బ్రిటీష్ ప్రభుత్వం ఉరితీసే 96 సంవత్సరాలు అయినప్పటికీ సమాజానికి పేరి స్నేహం, లౌకికత్వం గురించి తెలియదని వీరి స్నేహం లౌకికత్వం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుంటే సమాజంలో మతాల మధ్య విద్వేషాలు ఉండవన్నారు. కార్యక్రమంలో మండలం ఉపాధ్యక్షులు జానీ బాషా, ఆవాజ్ మండల నాయకులు షేక్ బాబు, మండల ప్రజా సంఘాల నాయకులు పి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : స్వాతంత్ర ఉద్యమంలో స్వాతంత్ర వీరుల్లో ముందుగా ఉరి కంభం ఎక్కినటువంటి వీరులు అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్లా 96వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీతా పోలయ్య భవనంలో అష్ఫాఖుల్లా ఖాన్, పండిత్ రాంప్రసాద్ బిస్మిల్ చిత్రపటానికి అవాజ్ జిల్లా కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కె చాంద్ బాషా మాట్లాడారు.కార్యక్రమంలో కోవూరు మండల నాయకులు నాగరాజు, విజయ్ కుమార్ బాబు, షఫీ, రసూల్, నజీర్, సుబ్బారావు, శ్రీనివాసులరెడ్డి, అఫ్రోజ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత


సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-కావలి రూరల్

సిఐటియు ఆధ్వర్యంలో 26వ తేదీ నుండి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని టిపిఒ ఎ.బాబురావుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్నో దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కరోనా నుండి ఇప్పటి వరకు డెయిలీ కార్మికులగా పనులు చేస్తున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, రిటైర్డ్ అయిన వారి స్థానంలో వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, రిటైర్మెంట్ బెనెఫిట్స్, పెన్షన్ విధానం అమలు చేయాలని, కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఇచ్చిన పర్మనెంట్ హామీని అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి ఎన్నోసార్లు తీసుకుపోయినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. గత్యంతరం లేక సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 26వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు దిగుతున్నామని ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య, సిఐటియు నాయకులు వై.కృష్ణ మోహన్, బి.కృష్ణయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తురక సీనయ్య, బి.మహేష్, కె.భాస్కర్, కే.బాబు, పి.అనిత తదితరులున్నారు.

గ్రంధికి అంతిమ వీడ్కోలు


అంతిమయాత్రలో పాల్గొన్న ఎంఎల్ఎ రామిరెడ్డి

ప్రజాశక్తి-కావలి

మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ ఎఎంసి చైర్మన్, ఎందరికో రాజకీయ గురువు, లెజెండ్ పొలిటీషియన్ గ్రంధి యానాది శెట్టి భౌతికకాయానికి మంగళవారం అంతిమయాత్ర సాగింది. అతిరథ, మహారథులైన రాజకీయ నాయకులు తమ చేతుల మీదుగా అయన పాడెను మోసి అంతిమ యాత్ర రథం మీదకు చేర్చారు. కార్యక్రమంలో టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు చేతులమీదుగా టిడిపి పతాకాన్ని కప్పారు. దగ్గుమాటి (కావ్య) కృష్ణారెడ్డి, గ్రంధి శిష్యులు, స్నేహితులు పాడెను మోసారు. అంతిమయాత్రలో కావలి ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, మాజీ ఎం.ఎల్.ఎ.లు బొల్లినేని వెంకటరామారావు, కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ముందు నడుస్తుండగా, ఎందరో ఆర్యవైశ్యులు, అనుంగు శిష్యులు బైక్ ర్యాలీ చేస్తూ, జనసంద్రంలా కదిలారు. ఈ అంతిమయాత్ర పూర్తయ్యే వరకు పట్టణంలోని దుకాణాలు అన్ని మూసి వేసి యానాది శెట్టికి తమ గౌరవం చాటుకున్నారు.

సిపిఎం నివాళులు : టిడిపి సీనియర్ నాయకులు గ్రంధి యానాదిశెట్టి అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, టి మాల్యాద్రి, పి తిరుపాలు, జి మధుసూదన్ రావు, వారి నివాసంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన ప్రజా జీవితంలో ప్రజా సమస్యలు ఎన్నో పరిష్కరించారని నియోజక వర్గంలోని ప్రజలకు సుపరిచితులని తెలిపారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

ప్రజాశక్తి-విడవలూరు : మండలంలోని దంపూరులో గ్రామ కంఠం ప్రభుత్వభూమి కబ్జాకు గురైందని వచ్చిన వినతి మేరకు మంగళవారం ఇన్‌ఛార్జి తహశీల్దార్ రమాదేవి మంగళవారం తన రెవెన్యూ సిబ్బందితో పరిశీలించారు. సందర్భంగా వారు 418 సర్వే నెంబర్‌లో మొత్తం 10 ఎకరాలు 64సెంట్లు భూమి ఉన్నట్లు రికార్డుల ఆధారంగా ఆమె తనికి చేసి సాగు రైతులను విచారణ చేసి వివరాలు ఆరా తీశారు. ఈ భూమిపై వచ్చిన పిర్యాదు మేరకు ఉన్నత అధికారులకు నివేదకు పంపనున్నట్ల తెలిపారు. ఆక్రమణకు గురైన భూమిని తగిన ఆధారాలు బట్టి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆమెవెంట మండలం రెవెన్యూ సిబ్బంది, స్థానిక రైతులు ఉన్నారు.



400 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి-సంగం

సంగం కావలి కాలువ రెగ్యులేటర్ నుండి కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మంగళవారం కావలి కాలువకు 400 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి రైతులు, నాయకులతో కలిసి ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం కావలి కాలువ రెగ్యులేటర్ పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి కాలువ ఆయకట్టు పరిధిలో ఉన్న ప్రతీ ఎకరాకు సాగునీరందించే చర్యలు చేపడుతున్నామన్నారు. తుపాన్ ప్రభావంతో వర్షాలు పడడంతో సోమశిల డ్యామ్‌కు పలు చెరువులకు నీరు చేరాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలలో రాష్ట్రంలో సాగు నీటి కొరత ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కావలి నియోజకవర్గం నాయకులు, రైతులు, సంగం వైసిపి నాయకులు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ (చేజర్ల)

మండల కేంద్రమైన చేజర్లకు అలాగే పక్క గ్రామమైన మడపల్లికి పెన్నానది నుండి తాగునీరు అందించే ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించిన ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డికి చేజర్ల, మడపల్లి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. చేజర్ల, మడపల్లి గ్రామాలకు తాగునీటి ఇబ్బందులను గమనించిన ఎంఎల్ఎ ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు విజ్ఞప్తుల మేరకు దగ్గరలోని పెన్నానది నుండి పైపులైన్ ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేశారు. మంగళవారం చేజర్ల ఎంపిపి తూమాటి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో చేజర్ల మడపల్లి గ్రామ నాయకులు మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఎంఎల్ఎ నివాసంలో ఎంఎల్ఎను కలిసి శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పూనూరు కొండారెడ్డి, తిరుపతి నాయుడు, రవీంద్ర నాయుడు, చంద్ర రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి గత అను భవాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒ కె.మధులత పేర్కొ న్నారు. డివిజన్ పరిధిలోని తహశీ ల్దార్లు, పోలీస్ అధికారులతో ఆర్‌డిఒ కార్యాల యంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డి.ఎస్.పి కోటారెడ్డి, ఎఒ సుభద్ర, అన్ని మండలాల తహ శీల్దారులు, సిఐలు వేణు, రవినాయక్, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కావలి: అర్హులందరికి సంక్షేమ పథకాలను అందజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పేదల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక 16వ వార్డ్ చంద్రబాబునగర్ కాలనీలో "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా 206వ రోజు మంగళవారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, నాయబ్ రసూల్, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నలంద స్కూల్లో గేమ్‌జోన్

ప్రజాశక్తి-కావలి: కావలి గాయత్రి నగర్‌లో ఉన్న నలంద పాఠశాలలో మంగళవారం "గేమ్ జోన్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ గేమ్ జోన్‌లో విద్యార్థులు రకరకాల వినోద భరితమైన ఆటలు ఆడారు. కార్యక్రమంలో భాగంగా నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎండి. మజహర్ విద్యార్థులలో మానసిక ఒత్తిడి తగ్గించి వాళ్లలో చురుకుదనాన్ని తీసుకుని రావటానికి ఈ గేమ్‌జోన్, నిర్వహించినట్లు, సైన్సు, అంతరిక్ష విజ్ఞానాన్ని అందించుట కోసం "మొబైల్ ప్లానిటోరియం" మొదలైన వినోద భరితమైన ఆటలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చివరిగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.



తప్పిపోయిన బాలిక అప్పగింత

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలంలోని కాకొల్లువారిపల్లి గ్రామానికి చెందిన బత్తుల మౌనిక (8), స్థానిక పాఠశాలలో స్కూలుకు వెళ్లి మధ్యాహ్నం నుండి కనిపించలేదని తల్లి దండ్రులు ఎస్ఐ కె.సుమన్ కి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్ఐ సిబ్బందిని గ్రామానికి పంపి రెండుగంటల పాటు వెతకగా పాప ఆచూకీ తెలుసుకొని బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే సబ్ ఇన్‌స్పెక్టర్ సుమన్ స్పందించిన తీరుపై బాలిక తల్లిదండ్రులు గ్రామస్తులు ఎస్ఐకి కృతజ్ఞతలు తెలియజేశారు.

కాపుల ఐక్యతను సాధించాలి

ప్రజాశక్తి-కావలి: కావలి నియోజకవర్గంలోని కాపులందరూ ఐకమత్యంగా ఉండాలని, ఈ ఐక్యత చాటడం ద్వారా కాపులకు రాజ్యాధికారం సాధించు కుందామని కాపు నాయకులు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక "ది కారోనేషన్ రీడింగ్ రూమ్" ఆవరణంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో కాపునాయకులు డాక్టర్ ఎన్.ప్రభాకరనాయుడు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, తోకల వెంకటేశ్వర్లు, సాధు శ్రీధర్, సమ్మును వెంకటసుబ్బయ్యలు మాటాడుతూ 17న ఏటూరు రామిరెడ్డి కల్యాణ మండ పంలో జరిగిన "కాపుల ఆత్మీయ సమ్మేళ నం" జయప్రదమైనందుకు వారు హర్షం వ్యక్తం చేశారు.

కక్ష సాధింపు పనికిరాదు..



మాట్లాడుతున్న మాజీ మంత్రి నారాయణ

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

ప్రజాస్వామ్యంలో ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని... కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సరికాదని, నియంత పాలన చెల్లదని ప్రజలు తిరస్కరించే రోజులు వైసీపీ ప్రభుత్వానికి దగ్గర పడ్డాయని మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు 6వ డివిజన్‌లో రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆయన మంగళవారం పర్యటించారు. ఆ డివిజన్ ప్రాంత పరిధిలోని దుకాణాలు, ఇళ్లకు వెళ్లి కరపత్రాలను అందజేసి, టీడీపీ లక్ష్యాన్ని క్షుణ్ణంగా ప్రజలకు వివరించి తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. డివిజన్‌కు విచ్చేసిన నారాయణకు టీడీపీ శ్రేణులు, ప్రజలు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ బాబుష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుం దన్నారు. నెల్లూరు ప్రజలు ప్రశాంత వాతా వరణం కోరుకుం టున్నారని తెలిపారు. గతంలో ఎప్పుడు లేనివిధంగా అరాచక పాలన వైసీపీ ప్రభుత్వం సాగిస్తుం దన్నారు. ప్రజాస్వా మ్యంలో కక్షసాధింపు చర్యలు సరికాదని హితవుకాదన్నారు. అభివద్ధి పనులు చేసి ప్రజలకు మంచి చేయాలని సూచించారు. వ్యాపారస్తులు వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన పన్నులు, కరెంట్ బిల్లులతో సతమతమ వుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజలపై భారం మోపిన సందర్భాలు లేవన్నారు. ఛాలెంజింగ్‌లు నవ్వుకోడానికే తప్పా అభివద్ధికి పనికి రావన్నారు .ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వారు ప్రజలకు సేవ చేయాలన్నారు. తమ హయాంలో రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో నడిపామని తెలిపారు. ఆపదల సమయంలో టీడీపీ శ్రేణులు ఎప్పుడు ముందుం టారన్నారు. తుపాన్ సమయంలో ఇబ్బందులు పడిన ప్రజలను ఆదుకున్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తన విజ్ఞప్తి మేరకు సహాయక చర్యలు చేపట్టిన నగర కమిషనర్‌ను అభినందిస్తున్నట్లు చెప్పారు. ప్రజాధరణతో 2024 ఎన్నికల్లో టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని స్పష్టం చేశారు.

అనంతరం రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండి పడ్డారు. అనిల్ నీకు అసలు టికెట్ వస్తుందో లేదో తెలుసుకోవాలన్నారు. దమ్ముంటే ఈ దఫా ఎన్నికల్లో నిలబడి పోటీ చేయగలవా అంటూ ప్రశ్నించారు.నారాయణ చేపట్టిన అభివద్ధి ప్రజలందరికీ తెలుసన్నారు. 2024 ఎన్నికల్లో 60 వేల ఓట్ల మెజార్టీతో నారాయణను నెల్లూరు నగర ప్రజలు గెలిపించబోతున్నారని ఘంటాపథంగా తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజా నాయుడు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, కొండ ప్రవీణ్ శంకర్, అన్నపూర్ణ, సాయి, నరహరి, రామకష్ణ, మల్లిక, తదితరులు పాల్గొన్నారు

ఎవరిని వదిలిపెట్టను..



మాట్లాడుతున్న నుడా చైర్మన్ ముక్కాల ద్వారకనాథ్

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

డ్రగ్స్ కేసులో నా కుమారుడిని తన స్నేహితుల్ని అరెస్టు చేశారని పుకార్లు చేసి నన్ను మానసిక శోభకు గురి చేశారని కూడా చైర్మన్ ముక్కాల ద్వారకనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత శనివారం ద్వారకనాథ్ కుమారుడు తన స్నేహితులతో కలిసి హైదరాబాద్ వెళ్లగా అక్కడ ఓ సర్వీస్ అపార్ట్మెంట్లో దిగగా పోలీసులు తనిఖీలు డ్రగ్స్ తీసుకున్నారన్న అనుమానంతో అక్కడి పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో వివిధ కథనాలతో కల్చర్ చేశాయి. ఈ విషయంపై మంగళవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. నా బిడ్డ నాతోనే ఉన్నాడు కారు నాతోనే ఉంది పుట్టినరోజు సందర్భంగా సరదాగా తన స్నేహితులతో కలిసి సర్వీస్ అపార్ట్మెంట్లో దిగగా అక్కడి పోలీసులు సాధారణ తనిఖీలో భాగంగా వారిని విచారణకు పిలిచారని స్టేషన్లో శనివారం అన్ని ట్రస్టులు చేసి సోమవారం రిపోర్టులు కోసం రమ్మన్నారని అన్ని నెగిటివ్ గానే వచ్చాయని వారు నిర్దోషులుగా నిర్ధారించి ఇంటికి పంపించడం జరిగిందన్నారు. నాపై ఏమైనా వ్యక్తిగత కక్ష సాధింపులు ఉంటే చూసుకోవాలని భవిష్యత్తు ఉన్న అభం శుభం తెలియని బిడ్డలపై ఇలా చేయడం తగదన్నారు. మా కుటుంబం ఎప్పుడు ఇలాంటి అలవాట్లకు చాలా దూరంగా ఉంటుందని డ్రగ్స్ కేసులో నాన్బెల్ కింద కస్టడీకి పంపుతారు గాని ఇంటికి పంపరన్నారు. గుడ్డ కాల్చి ముఖాన వేయడం చాలా దారుణం అన్నారు. దీని వెనుక ఎవరు ఉన్నారు మా ఫొటోలు ఎవరు పంపించారు. పక్కా ఆధారాలు నా వద్ద ఉన్నాయన్నారు. ఇన్ని రోజులు నన్ను టార్గెట్ చేసిన నేను చూసి చూడనట్లు ఉన్నానని ఈ విషయంలో న్యాయపోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నాను మమ్మల్ని బజారుకు లాగిన వారు ఎంత వారైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. జగన్మోహన్ రెడ్డికి నిజమైన కార్యకర్తగా విధేయత చూపుతానని వాట్సాప్ సోషల్ మీడియాలలో తప్పుడు ప్రచారం చేసి నా ప్రతిష్టకు భంగం కలిగించాలని చూసినా ప్రతి ఒక్కరికీ లీగల్ నోటీసులు పంపుతానన్నారు. అవాస్తవాలు ప్రచారం చేసిన ప్రతి ఒక్కరినీ కోర్టు ముందు దోషులుగా నిలబడక తప్పదన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.40లక్షలు కేటాయింపు

ప్రజాశక్తి-వరికుంటపాడు: రోడ్డు నిర్మాణానికి రూ.40లక్షలు కేటాయిస్తున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రకటిం చారు. మండలంలోని రామాపురం సచివాలయ పరిధిలోని రామాపురం హుస్సేన్ నగర్‌లో మంగళవారం గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేకపాటి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి జగనన్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. అనం తరం సచివాలయ కన్వీనర్ చెన్నారాయుడు హుస్సేన్ నగర్ ఎన్నోయేళ్ల నుంచి తమ గ్రామానికి రోడ్డు లేవని మేకపాటి రాజగోపాల్ రెడ్డిని అడగగా ఆయన స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణానికి రూ. 40లక్షలను ప్రకటించారు. ప్రకటించటంతో హుస్సేన్ నగర్ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అలీ



అహ్మద్, మండల కన్వీనర్ మం దలపు తిరుపతి నాయుడు, జెడ్‌పిటిసి రావేల నాగేంద్ర సొసైటీ చైర్మన్ గుం టుపల్లి రామాంజనేయులు, చివాల య కన్వీనర్లు చెన్నారాయుడు, రాయ వరపు మధు, మేడసాని చెన్నకేశవులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి నారాయణ

దొంగ ఓట్లను అరికట్టాలి..

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

ప్రజాస్వామ్యం నిలబడాలంటే దొంగ ఓట్లను ప్రతి ఒక్కరూ అరికట్టేందుకు కషి చేయాలని మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓటర్ స్పెషల్ డ్రైవ్ సమావేశానికి టీడీపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్‌తో పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో దొంగ ఓటు అనేది లేకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ఓటర్ వెరిఫికేషన్‌పై నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఎక్కడ కూడా దొంగ ఓట్లకు తావు లేకుండా చూడాలని కమిషనర్‌ను కోరినట్లు చెప్పారు. అదేవిధంగా టీడీపీ బీఎల్‌ఏలు గుర్తించిన ఓటర్ లిస్టును అందజేసి వెరిఫికేషన్ చేయమని కోరినట్లు తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో అవినీతికి తావు లేకుండా దొంగ ఓట్లను నివారించాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని పార్టీలతో పాటు అధికారులు సైతం సహకరించాలని కోరారు.అనంతరం టీడీపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఓటర్ లిస్టులో చాలా అవకతవకలు ఉన్నాయన్నారు. గతంలో గందరగోళంగా ఉండడంతో ఓటర్లు చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దొంగ ఓట్లకు చెక్ పెట్టాలన్నారు. నగర నియోజకవర్గ పరిధిలో దాదాపు ఆరు వేల ఓట్ల వరకు తప్పొప్పులు ఉన్నాయని, 13 వేల ఓట్ల వరకు అడ్రస్‌లో డోర్ నెంబర్లు లేవన్నారు. ఈ మేరకు సవరణలు చేయాలని కమిషనర్‌ను కోరామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరప్రసాద్, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు రసూల్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు దర్శి హరికష్ణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి: కావలి పట్టణం నివాసులైన సాఫ్ట్‌వేర్ కె.మానస సంయుక్త సేవాసంస్థ ద్వారా కాలేరుగుంట సమీపంలో రోడ్డు పక్కన పట్టలతో ఇల్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్న మూడు నిరుపేద గిరిజన కుటుంబాలను దత్తత తీసుకొని వారికి కొన్ని నెలలుగా నిత్యావసర వస్తువులు, బియ్యం, నగదు అందజేయడం జరుగుతోంది. దానిలో భాగంగానే మంగళవారం సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా మూడు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, బియ్యం నగదు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ మానసా దాతృత్వానికి నిదర్శనమని తెలిపారు.

సోమిరెడ్డిది సత్యాగ్రహ దీక్ష కాదు..ఆకలి దీక్ష..

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సర్వేపల్లి లో చేసే దీక్ష సత్యాగ్రహ దీక్ష కాదని ధన, ఆకలి దీక్ష అని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటేశ్వరయ్య అన్నారు మంగళవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనుపూరు చెరువులో గ్రావెల్ తరలిస్తున్నారని అతని పోస్ట్ చేసి రెండు గంటలు తిరగకు ముందే ఆ పోస్ట్‌ని డిలీట్ చేశారన్నారు. మనుబోలు మండలంలో ధాన్యంకు గిట్టుబాటు ధర లేదని తక్కువ ధరకు వైసిపి నాయకులు బ్రోకర్లుగా మారి కొనుగోలు చేస్తున్నారని ఆరోపణలు చేసి ధర్నా చేశారని వాటిపై విచారణ జరపగా చివరకు అతని అనుచరులే అని తెలిసిందని వారిపై ఇప్పటికీ కోర్టులో కేసులు నడుస్తున్నాయన్నారు. సైదాపురంలో అక్రమ మైనింగ్ జరుగుతుందని వారిని బ్లాక్ మెయిల్ చేసి వారి దగ్గర ఐదు కోట్ల రూపాయలు తీసుకున్నామని ఆయన ఆరోపించారు.అవినీతి రహితుడు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అని అతనిపై ఎలాంటి ఆరోపణలు చేసిన దాని నిరూపించే సత్తా ఆయనకు లేదన్నారు. గతంలో మహిళల చేత పురుషుల చేత పన్నులదిన్నె సోమిరెడ్డి ఇప్పుడు హిజ్రాలతో కూడా తన్నులు తిని వారు నన్ను ఆశీర్వదించడానికి వచ్చారని బుకాయిస్తున్నాడని ఆయన ఎద్దేవా చేశారు.